పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి పైలట్ ప్రాజెక్టు

» సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసమూర్తి

-5లో

టిప్పర్ లారీల సమ్మె ఉధృతం

» మూడు జిల్లాల్లో ఇసుక ఇబ్బందులు
» నిలిచిన భవన నిర్మాణ పనులు
» ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
» లారీ యజమానుల విజ్ఞప్తి

ఏలూరు ఎస్పీగా శివకిశోర్



ఏలూరు జిల్లా ఎస్పీగా వస్తున్న ప్రతాప్ శివకిశోర్



బదిలీ అయిన ఎస్పీ మేరీ ప్రశాంతి

» డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఎస్పీ మేరీ ప్రశాంతికి ఆదేశం

ఏలూరు క్రైం, జూలై 13 : ఏలూరు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా డైరెక్ట్ ఐపీఎస్ అధికారి (2019) కొమ్మి ప్రతాప్ శివ కిషోర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఐపీఎస్ అధికారిణి దాసరి మేరీ ప్రశాంతిని అమరావతిలో ఉన్న డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రాంతానికి చెందిన కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తండ్రి నారాయణ, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉండగా తల్లి నిర్మల గృహిణి. శివ కిషోర్ వరిపాడు మండలం సంచులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు చదివారు. తొమ్మిది, పదో తరగతులను జవహర్ నవోదయ విద్యాలయలో చదివారు. ఇంటర్ ఒక ప్రైవేటు కళాశాలలో చదివారు. 2015లో ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం బాసే సెంట్రల్ ఆర్మీ ఇంటెలిజెన్స్‌లో సీనియర్ డేటా శాస్త్రవేత్తగా ఉద్యోగం పొందారు. 2018లో మూడో పర్యాయం సివిల్స్ రాసి ఉత్తీర్ణత సాధించి 2019 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా విధుల్లో చేరారు. ప్రస్తుతం అసిస్టెంట్ సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ గ్రేడ్-1అధికారిగా అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతపల్లి సబ్ డివిజన్‌లో పనిచేస్తున్నారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయనను జిల్లా ఎస్పీగా బదిలీ చేస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిష్టాత్మక ప్రైమ్ మినిస్టర్ కప్ అవార్డును ఆయన 2022లో అందుకున్నారు. సోమవారం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎస్పీ మేరీ ప్రశాంతి సేవలు ప్రశంసనీయం

ఐపీఎస్ అధికారిణి దాసరి మేరీ ప్రశాంతి జిల్లా ఎస్పీగా 2023 ఏప్రిల్ 12వ తేదీన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఏలూరులో జరిగిన ఒక యువతిపై యాసిడ్ దాడి, హత్య కేసులో 48 గంటల్లోనే నిందితులను అరెస్టు చేయగా వారిలో ముగ్గురికి 108 రోజుల్లోనే స్పీడ్ ట్రైల్ కోర్టులో భాగంగా జీవిత ఖైదు పడే విధంగా కృషి చేశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళలకు సంబంధించిన కేసులలో 17 కేసుల్లో జీవిత ఖైదు శిక్షలు పడ్డాయి. కోర్టు స్పెషల్ మానిటరింగ్ సెల్ విభాగాలను ఏర్పాటు చేసి గ్రేవ్ కేసులపై పర్యవేక్షణ చేసి శిక్షలు పడేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో సమర్థవంతంగా విధులను నిర్వర్తించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీటవేస్తూ ప్రతి శుక్ర వారం వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. మొత్తం మీద జిల్లా ప్రజల హృదయాల్లో నిజాయితీ గల ఐపీఎస్ అధికారి ణిగా నిలిచారు. 'ఆంధ్రజ్యోతి'తో శనివారం రాత్రి ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరి సహకారంతోనే సమర్థవంతంగా విధులను నిర్వర్తించగలి గానని అందరికి కృతజ్ఞతలు తెలిపారు.



అదనాన్ నయీమ్ అస్మి



అజిత వేజెండ్ల

• 'పశ్చిమ' ఎస్పీగా అదనాన్ నయీమ్ అస్మి

పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీగా అదనాన్ నయీమ్ అస్మి నియమితులయ్యారు. ప్రస్తుత ఎస్పీగా ఉన్న అజిత వేజెండ్ల విశాఖపట్నం సిటీ డిప్యూటీ కమిషనర్-1గా బదిలీపై వెళుతున్నారు. 2013 బ్యాచ్‌కు చెందిన నయీమ్ ప్రస్తుతం కృష్ణా జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు.



రూ.23 కోట్లు బాదేశారు!

వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా ఆస్తి పన్నుల వడ్డన

» ఆస్తి మూలధన విలువ ఆధారంగా పన్నుల విధింపు
» పన్నుల భారంతో ప్రజల నడ్డి విరిచిన వైనం

ఏలూరు టూటౌన్, జూలై 13 : వైసీపీ పాలనలో నగర ప్రజలు ఆస్తి పన్నుల పెంపుతో బెంబేలెత్తారు. మేము కట్టలేం మొర్రో అని మొత్తుకున్న వైసీపీ పాలకులు ఒప్పుకోలేదు. ఏటా 15 శాతం ఆస్తిపన్ను పెంపుతో ప్రజల నడ్డి విరగొట్టారు. పేరుకే 15 శాతం కానీ నూరుశాతం పైగా ఆస్తి పన్నులు పెరిగాయి. 2021 -22కు ముందు అద్దె విలువ ప్రతిపాదకన టీడీపీ ప్రభుత్వం పన్నులు వసూలు విధించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆస్తి మూలధన విలువ ఆధారంగా పన్నులు విధించింది. దీంతో గత నాలుగేళ్లలో ప్రజలపై అదనంగా రూ.22 కోట్ల 83 లక్షల భారం పడింది.

బాదుడు ఇలా..

నగర పాలక సంస్థ పరిధిలో 2021 - 22 ఆర్థిక సంవత్సరంలో 68,183 మంది పన్ను కట్టేవారు ఉండగా ఆ ఏడాది రూ.17.17 కోట్లు పన్నులు విధించారు. మరుసటి ఏడాది 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.30.58 కోట్లకు ఆస్తి పన్ను పెరిగిపోయాయి. ఒక్క ఏడాదిలోనే మూలధన విలువ ప్రాతిపాదికన ఆస్తి పన్ను రూ.13.41 కోట్లు అదనంగా ప్రజలపై భారం మోపారు. అంటే ఒక్క ఏడాదిలోనే 75 శాతం పన్నులు పెంచేశారు. 2023-24 సంవత్సరానికి రూ.33.80 కోట్లు పన్నుల రూపేణ విధించారు. అంటే రూ.2.22 కోట్లు అదనపు భారం ప్రజలపై పడింది. ఈ ఏడాది 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.40 కోట్ల ఆస్తి పన్నులు వసూలు చేయాలని అంచనాలు రూపొందించారు. ఈ ఏడాది అదనంగా మరో రూ.6.20 కోట్లు ప్రజలపై భారం పడనుంది. గడిచిన నాలుగేళ్ల 133 శాతం పన్నులు పెరిగాయి. దీంతో గత వైసీపీ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

220 ఖాళీ స్థలాలపై..

నగరంలో ఖాళీ స్థలాలు అధిక సంఖ్యలోనే ఉన్నా నగర పాలక సంస్థ అధికారులు గుర్తించినవి మాత్రం 220 స్థలాలు. ఈ ఖాళీ స్థలాలపై 2021-22 సంవత్సరంలో రూ.54.50 లక్షలు, 2022-23లో రూ.కోటి, 2023-24లో రూ.2 కోట్లు పన్నులు వేశారు. ఈ ఏడాదీ రూ.రెండు కోట్లు వసూలు చేయాలని అంచనాలు తయారు చేశారు. వైసీపీ చేసిన నిర్వాకం వల్ల ఏటా ఆస్తుల విలువలు ఎంత పెరిగితే అంత ఎక్కువగా పన్నులు పెరుగుతాయి. పేరుకు వైసీపీ ప్రభుత్వం 15 శాతమే పెంచుతామని చెప్పినా గత నాలుగేళ్లలో 100 శాతానికి పైగా ఆస్తి పన్నులు పెరిగాయి. మూలధన విలువ ఆధారంగా పన్నులు వేస్తే భవిష్యత్తులో ప్రజలు భరించే పరిస్థితి ఉండకపోవచ్చు.

ముక్కుపిండి వసూలు..

తంగెళ్ళమూడిలో వెంకటలక్ష్మి అనే గృహిణి 2021- 22లో రూ.2,486లు ఆస్తి పన్ను కట్టేది. 2024-25 సంవత్సరం వచ్చేనాటికి రూ.4,750లకు ఆస్తి పన్ను చేరింది. నాలుగేళ్ళలో రూ.1,264 అదనంగా పన్ను పెరిగింది. 2021-22లో ప్రజలు కరోనాతో బాధ పడుతున్నప్పటికి పెంచిన ఆస్తి పన్నుల జీవోను చాలా కర్కశంగా వైసీపీ ప్రభుత్వం అమలు చేసింది. అయితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండటాన్ని గమనించిన వైసీపీ ప్రభుత్వం ఆ ఏడాది పెరిగిన ఆస్తి పన్నులు వసూలు చేయకుండా మరుసటి ఏడాది పెరిగిన 15 శాతంతో పాటు అంతకు ముందు ఏడాది పెంచినవి కూడా ముక్కుపిండి మరీ వసూలు చేశారు. నగరంలో 2021లో పోణంగి, మాదేపల్లి, తంగెళ్ళమూడి, శనివారపుపేట, సత్రంపాడు, పాలగూడెం, వెంకటాపురం గ్రామాలు విలీనమయ్యాయి. దీంతో ఎంతో అభివృద్ధి చెందుతాయని గ్రామస్థులు ఊహించారు. దానికి విరుద్ధంగా ఎటువంటి అభివృద్ధి చేయకుండా ఆస్తి పన్నులు విపరీతంగా పెంచడం తో అయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎడతెరపిలేని వర్షాలు

» ఏజెన్సీలో పొంగిన కాల్వలు.. కుక్కునూరులో ఉధృతంగా గుండేటి వాగు
» జిల్లాలో అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో 54.6 మి.మీ వర్షపాతం
» పల్లపు ప్రాంతాలు జలమయం.. జోరుగా సార్వా సాగు పనులు



దిప్పకాయలపాడు రాతిచెరువు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఏలూరు సిటీ/కుక్కునూరు/కొయ్యలగూడెం/పోలవరం/బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం, జూలై 13 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ప్రభావం కారణంగా జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి 10.30 గంటల నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జిల్లాలో జనజీవనం స్తంభించింది. పలు ప్రాంతాల్లో కాల్వలు, వాగులు పొంగాయి. భారీగా వీచిన ఈదురుగాలులు ప్రభావం కారణంగా పలు ప్రాంతాల్లో అరటి తోటలు, కూరగాయల తోటలు దెబ్బ తిన్నాయి. మరోవైపు సార్వా సాగు పనులు జోరందుకున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో కొయ్యలగూడెం మండలంలో అత్యధికంగా 54.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 21.7 మి.మీ నమోదైంది. వేలేరుపాడు 46, టి.నరసాపురం 45.2, ముదినేపల్లి 38.4, కైకలూరు 36.4, కుక్కునూరు 34.6, పోలవరం 34, దెందులూరు 32.4, మండవల్లి 30.8, పెదవేగి 29.8, కామవరపుకోట 29.2, కలిదిండి 24.2, చింతలపూడి 21, ద్వారకా తిరుమల 19.2, భీమడోలు 15.8, ఏలూరు రూరల్ 13.6, లింగపాలెం 12.2, ఉంగుటూరు 12, నిడమర్రు 11.4, ఏలూరు అర్బన్ 11.2, ఆగిరిపల్లి 9.6, పెదపాడు 9.4, బుట్టాయిగూడెం 8.6, జంగారెడ్డిగూడెం 7.2, నూజివీడు 6.2, చాట్రాయి 4.8, ముసునూరు 4.6, జీలుగుమిల్లి 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూచించింది. వర్షాలు కురిసే సమయంలో పొలాల్లోని విద్యుత్ మోటార్లను ఆన్ చేయవద్దని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. విద్యుత్ స్తంభాలు పొలాల్లో ఒరిగి పడే పరిస్థితి ఉంటే తక్షణమే ఆయా మండల విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



ఏలూరులో వర్షంలో ఇలా..

ఏజెన్సీలో పోటెత్తిన వాగులు

జోరుగా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీలోని కుక్కునూరు మండలంలో వాగులు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. గుండేటి వాగుకు భారీగా వర్షపునీరు వచ్చి చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. పాలవాగు, వెంకటాపురం వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద గోదావరినీటి మట్టం 13.5 అడుగులకు చేరుకుంది. కుక్కునూరు గోదావరి తీరప్రాంతంలో పుష్కర్‌ఘాట్ వద్ద కింద మెట్ల వరకు గోదావరి నీటి మట్టం పెరిగింది. కొయ్యలగూడెం మండలం కన్నాపురంలోని తూర్పు, పడమటి కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కొద్దిసేపు వాహనాలు నిలిచాయి. దిప్పకాయలపాడు రాతి చెరువు వద్ద రోడ్డుపై మోకాళ్లలోతు వర్షపునీరు ప్రవహిస్తోంది. కొయ్యలగూడెంలోని అపోలో పాఠశాల వద్ద వర్షపునీరు రోడ్డుపై ప్రవహించింది. మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరిచేలు నీట మునిగాయి. పోలవరంలో ఏకధాటిగా వర్షం కురియడంతో పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల పోలవరం గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం మెయిన్ రోడ్డులో నీరు నిలిచి ప్రజానీకం రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు.



కుక్కునూరు గోదావరి తీర ప్రాంతంలో పెరిగిన నీటిమట్టం



చినవెంకన్న క్షేత్రంలో భక్తుల పాట్లు

ద్వారకా తిరుమల : జోరున వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా వేలాది మంది భక్తులు శ్రీవారి క్షేత్రానికి శనివారం విచ్చేశారు. తెల్లవారుజాము నుంచి ఆగకుండా దంచికొడుతున్న వర్షం వల్ల ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బం దులు పడ్డారు. కొందరు తడుచుకుంటూనే ఆలయంలోకి ప్రవేశించగా మరి కొందరు గొడుగు, టవల్స్ వంటి ప్రత్యామ్నాయాలను వినియోగించారు.

రోడ్డుపై నుంచి వరదనీరు..



కొండవాగుల నుంచి వచ్చిన వరద ప్రవాహం వల్ల జంగారెడ్డిగూడెం మండలంలోని పట్టెన్నపాలెం వంతెన వద్ద జల్లేరు వాగు పొంగి తాత్కాలికంగా వేసిన రహదారి పైకి వరదనీరు చేరడంతో శనివారం సుమారు రెండు గంటల పాటు ప్రయాణాలు నిలిచిపోయాయి. పట్టెన్నపాలెం, అక్కంపేట, జైనవారిగూడెం, రామారావుపేట సెంటర్ తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడ్డారు.



గుబ్బల మంగమ్మ ఆలయం దారి మూసివేత

ఏజెన్సీ వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నందున కొండవాగులు పొంగుతున్నాయి. గుబ్బల మంగమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలోని ఎర్ర ఎక్కుడు కొండవాగు శనివారం మధ్యాహ్నం రెండు గంటలపాటు ఉధృతంగా ప్రవహించి కొద్దిగా తగ్గుముఖం పట్టింది. దీంతో ఆలయ కమిటీవారు పోలీసులు ఆధ్వర్యంలో భక్తులు ఆలయానికి వెళ్లకుండా ముందుజాగ్రత్త చర్యగా కావవరం వద్ద ఆలయానికి వెళ్ళే దారిలో ఏర్పాటు చేసిన గేట్లను మూసివేశారు. వర్షాలు కురుస్తున్నందున కొండవాగులు పొంగి ప్రవహించే ప్రమాదం ఉన్నందున భక్తులు రావొద్దని సూచించారు.



చికిత్స పొందుతున్న రోగి నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌యాదవ్

ఏలూరు ప్రభుత్వాస్పత్రిని మోడరన్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతా

» ఎంపీ పుట్టా మహేష్ కుమార్


ఏలూరు క్రైం, జూలై 13 : ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని మోడరన్ ఆస్పత్రిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు. ఆస్పత్రిని శనివారం ఉదయం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి అన్ని విభాగాల్లో రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో దోమలు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. జనరల్ వార్డు నుంచి విభాగాలన్నింటిలో ఏసీలు ఉండాలని, అందుకు అవసరమైన నిధులను సమకూరు స్తానని ఎంత బడ్జెట్ అవసరమో మూడు రోజుల్లోగా తగిన నివేదిక అందించాలని సూచించారు. ఏపీఎస్ఎంఐడీసీ ఇంజనీర్ రాజబాబు నుంచి ఆస్పత్రి అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి విభాగానికి ఆపరేషన్ చేసే నిమిత్తం వైద్య పరికరాలు అవసర మని డాక్టర్ ఎస్.రామ్ ఆయన దృష్టికి తీసుకెళ్లగా సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఆస్పత్రిలో ప్రస్తుతం 330 పడకలకే అనుమతి ఉందని దీనిని పెంచడానికి కృషి చేస్తానన్నారు. ట్రామాకేర్ విభాగాన్ని పరిశీ లించారు. ఇన్‌ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాస్, ఆర్ఎంవో డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ మల్లిఖార్జునరావు, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



అటకెక్కిన.. భూసార పరీక్షలు!

» వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం..
» మట్టి నమూనాలు గొల్లపల్లికి తరలింపు
» అవస్థలు పడుతున్న రైతులు

ఏలూరు రూరల్, జూలై 13 : గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగంలో ప్రధానమైన భూసార పరీక్షలు నిలిచిపోయాయి. జిల్లాలో అసలు భూసార పరీక్షా కేంద్రం లేకపోవడం విడ్డూరం. ఈ కారణంగా వందలాదిమంది రైతులు వారి పొలాల్లోని మట్టి నమూనాలను కృష్ణా జిల్లా గొల్లపల్లి భూసార పరీక్షా కేంద్రానికి పంపాల్సి వస్తోంది. రైతులు తమ పొలాల్లో మట్టి సాంద్రత తెలుసుకోవడానికి గొల్లపల్లి కేంద్రానికే వెళ్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టలేదు. జిల్లాలో రైతులకు ఎంతో ఉపయోగపడే భూసార పరీక్షా కేంద్రాలను పెట్టక పోవడం, అగ్రి ల్యాబ్‌లు నిర్మాణం పునాదుల్లోనే ఉండిపోయింది. భూసార పరీక్షా కేంద్రాలకు నిధులు మంజూరు చేయలేదు. ఖరీఫ్, రబీ సీజన్‌లో మట్టి నమూనాలను పరీక్ష చేసేందుకు రసాయనాలు, కంప్యూటర్లు, సిబ్బంది నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. అగ్రిల్యాబ్ నిర్మాణం తలపెట్టిన నేటికీ నిర్మాణం కొనసాగుతూనే ఉంది.



ఫైల్

నాలుగేళ్లుగా రైతులకు అవస్థలు

వ్యవసాయంలో ప్రధానమైన తంతు భూసార పరీక్షలు. భూమిలో స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో భూసార పరీక్షలో తెలుసుకుంటారు. సూక్ష్మపోషకాలైన ఐరన్, జింక్ తదితరాలు ఎంత నిష్పత్తిలో ఉంటాయో వాటి పీహెచ్ వాల్యూ ఎంత ఉందో ఈ పరీక్షల ద్వారా తెలుసుకుంటారు. పీహెచ్ వాల్యూ 7.1 ఉంటే భూమి పంట సాగుకు అనువుగా ఉంటుంది. భూసార పరీక్ష కేంద్రాల నిపుణులు, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఏ నిష్పత్తిలో రసాయనాలు వాడాలో వివరిస్తారు. కాని జిల్లాలో ఒక్క భూసార పరీక్షా కేంద్రం లేక పోవడంతో రైతులు మట్టి నమూనాలు సేకరించి గొల్లపల్లికి పంపుతున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలతో పాటు నమూనాలు ఫలితాలకు పదిరోజులు పడుతుంది. దీంతో సీజన్‌లో అదనుపోయి పంట సాగులో నష్టాల బారిన పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమ కావడంతో మట్టి నమూనాలు సేకరించి గొల్లపల్లి భూసార పరీక్షాకేంద్రానికి పంపుతున్నారు. జిల్లా నుంచి మట్టి నమూనాలు ఎక్కువగా వస్తుండడంతో ఫలితాలు ఆలస్యంగా వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత విధానాలపై ప్రస్తుతం ఖరీఫ్ రైతులు అగచాట్లు పడాల్సి వస్తోంది. ఈక్రమంలో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. మట్టి నమూ నాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఆయా మండల వ్యవసాయ శాఖ అధికారులకు పంపుతున్నారు. నమూనాలను భూసార పరీక్ష కేంద్రానికి ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు ద్వారా వ్యవసాయాధికారులు పంపుతున్నారు.

నిరుపయోగంగా చెక్‌డ్యామ్‌లు



చాట్రాయి ఫారెస్ట్‌లో చెక్‌డ్యామ్

చాట్రాయి, జూలై 13 : మండల పరిధిలోని ఫారెస్ట్ బ్లాక్‌లలో రెండు దశాబ్దాల ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నిరుపయోగంగా మారాయి. చాట్రాయి, పోలవరం, పర్వతాపురం, ఆరుగొలనుపేట, సోమవరం, చీపురుగూడెం గ్రామాల్లో ఐదు వేల ఎకరాల్లో అటవీ భూములు ఉన్నాయి. ఈ భూముల్లో పచ్చదనం పెరగడానికి, వన్యప్రాణుల దాహర్తి తీర్చడానికి, భూగర్భజలాలు పెరగడం కోసం ఇరవై ఏళ్ల క్రితం పది చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. వీటిని నిర్మించాక కొన్నేళ్ల పాటు వాటిలో వర్షం నీళ్లు నిలిచి అడవులు పచ్చదనంతో కళకళలాడాయి. మూగజీవాలకు పుష్కలంగా తాగునీరు దొరికింది. క్రమేణ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెక్‌డ్యామ్‌లో ఇసుక మట్టి మేట వేసి నీరు నిలిచే అవకాశం లేక నిరుపయోగంగా మారాయి. చెక్‌డ్యామ్‌లలో పూడిక తీసి కొద్ది పాటి మరమ్మతులు చేస్తే మళ్ళీ ఉపయోగంలోకి వస్తాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జగదభిరామునిగా జగన్నాథుడు


శ్రీరామునిగా దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకా తిరుమల, జూలై 13: జగదభి రామునిగా జగన్నాథుడు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతాసమేత శ్రీరామచంద్రమూర్తిగా జగన్నాథుని దర్శనం భక్తజనులను అలరించింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.


సీఎంకు రూ.కోటి విరాళం అందిస్తున్న ఎస్ఎల్వీ గ్రూప్ చైర్మన్ శ్రీనివాసరాజు

అన్న క్యాంటీన్ల నిర్వహణకు కోటి విరాళం

» సీఎంకు ఎస్ఎల్వీ గ్రూపు చైర్మన్ శ్రీనివాసరాజు చెక్కు అందజేత

భీమవరం టౌన్, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే అన్న క్యాంటీన్లకు భీమవరానికి చెందిన ఎస్ఎల్వీ గ్రూప్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు కోటి రూపాయలు విరాళం ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామంలో నిర్మిస్తున్న ఇస్కాన్ టెంపుల్ వద్ద హరే కృష్ణ గోకుల క్షేత్రంలో జరిగిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ల నిర్వహణ నిమిత్తం శ్రీనివాసరాజు వారి కుటుంబసభ్యులతో కలిసి తమ వంతు సాయంగా కోటి రూపాయల చెక్కు అందజేశారు. అదేవిధంగా ఇస్కాన్ టెంపుల్ నిర్మాణానికి కోటి ఎనిమిది లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలకు తన వంతు సహకారంగా ఈ మొత్తాన్ని అందజేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబు అభినందించారు.


టెన్నిస్ పోటీలకు హాజరైన బాలబాలికలతో నిర్వాహకులు

రాష్ట్రస్థాయి బాల బాలికల టెన్నిస్ పోటీలు ప్రారంభం

పాలకొల్లు రూరల్, జూలై 13 : పట్టణంలోని శ్రీమామిడి వెంకట శివయ్య మెమోరియల్ టౌన్‌హాల్ ఆధ్వర్యంలో అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను కార్యదర్శి ముచ్చర్ల ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ బి.మోహన్ కళ్యాణ్ మాట్లాడుతూ రెండురోజుల పాటు నాక్ అవుట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి 30 మంది బాలబాలికలు విచ్చేశారన్నారు. అండర్ -8, 10, 12, 14 బాలబాలికలను నాలుగు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కొటికలపూడి కృష్ణ, రావూరి చాచా, వీరా బాబ్జీ, ఎం.అనూరాధ, జక్కంపూడి వెంకటరంగారావు, ఆకుల అరవిందుడు, ఎస్. నూరిబాబు, అడ్డాల రాంబాబు, కోచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూలై 13 : ఉద్యోగం నిమిత్తం బెంగళూరు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ మంగయ్య శనివారం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన వెంపాటి వెంకట శివసాయిరాం ఇంజనీరింగ్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈనెల ఏడో తేదీన బెంగుళూరు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడన్నారు. ఆ తర్వాత నుంచి తన కుమారుడి ఫోన్ పనిచేయడంలేదని, ఏమయ్యాడో తెలియడంలేదని తండ్రి వెంపాటి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

టిప్పర్ లారీల సమ్మె ఉధృతం

» మూడు జిల్లాల్లో ఇసుక ఇబ్బందులు
» నిలిచిన భవన నిర్మాణ పనులు
» బిల్డింగ్ ప్లాన్ నిబంధన విరమించాలి
» ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
» లారీ యజమానుల విజ్ఞప్తి
» పులిదిండి, గోపాలపురంలలో అక్రమ తవ్వకాలు ?

పాలకొల్లు, జూలై 13 : ఉమ్మడి జిల్లాలో ఇసుక సరఫరా చేసే టిప్పర్ లారీల సమ్మె ఉధృతమైంది. తూర్పు గోదావరి జిల్లాలో అప్రూవల్ ప్లాన్ ఉంటేనే ఇసుక ఎగుమతి చేసే నిబంధనలను అధికారులు అమలు చేయడంతో ఈనెల పదో తేదీ నుంచి ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో టిప్పర్ లారీల యజమానులు సమ్మెకు దిగారు. ఈ మేరకు నాలుగు రోజులుగా ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇసుక సరఫరా నిలిపి వేశారు. దీంతో నిర్మాణ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కోనసీమ జిల్లాలో ఇసుక ఎగుమతులు యథావిధిగా జరుగుతున్నాయి. ఆధార్ కార్డు ఉంటే ఇసుక సరఫరా చేస్తుండగా, రాష్ట్రం అంతా ఇదే విధానం అమలు జరుగుతుండగా.. తూర్పు గోదావరి జిల్లాలో మాత్రం అప్రూవ్డ్ ప్లాన్ ఉంటేనే ఇసుక ఇస్తామని అనడం పట్ల టిప్పర్ లారీ యజమానులు, అసోసియేషన్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సమ్మెకు దిగారు. రాష్ట్రం అంతటా అమలు అవుతున్న విధానాన్నే తూర్పు గోదావరి జిల్లాలో అమలు చేయాలని లారీ యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తూర్పు గోదావరి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని లారీ యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల తీరుపై అసహనం..

ఆధార్ కార్డు తెచ్చుకుంటే ఇసుకను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు తరలించుకునే వెసులు బాటును గనుల శాఖ మంత్రి కల్పించినప్పటికీ తూర్పుగోదావరి జిల్లాలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల టిప్పర్ లారీ యజమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు



కోనసీమ జిల్లాలో ఇసుక ఎగుమతుల రశీదు

పులిదిండి, గోపాలపురంలలో తవ్వకాలు అధికం..

కోనసీమ జిల్లాలో స్టాక్ పాయింట్ల నుంచి అధికారికంగా అమ్మకాలు జరుగుతుండగా పులిదిండి, గోపాలపురం ర్యాంపులలో రాత్రి సమయాల్లో పెద్దఎత్తున ఇసుక తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత బుధవారం పెరవలిలో అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక లారీలను సీజ్ చేశారు. అయినప్పటికీ అక్రమ ఇసుక ఎగుమతులు ఆగలేదని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ళలోనే ఇసుకను కేవలం నాలుగు రోజులలో అక్రమ అమ్మకాలు జరిపి కోట్లాది రూపాయలు ఆర్జించిన కొందరు ప్రజాప్రతినిధులు కోనసీమలోనూ దందా ప్రారంభించారని పలువురు చెబుతున్నారు. మూడు జిల్లాల్లో ఏర్పడిన ఇసుక విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.


ఇసుకలేక నిలిచిన భవన నిర్మాణ పనులు

ఆస్పత్రి భవన నిర్మాణంలో నాణ్యతా లోపం

» మంత్రి నిమ్మల అసహనం.. కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు

పాలకొల్లు టౌన్, జూలై 13: పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా పెంచుతూ నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రారంభం కాకుండానే స్లాబ్ నుంచి వర్షం నీళ్లు కారడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. లోపలకి వెళ్లి చూడగా ఫ్లోరింగ్ ఎత్తు పల్లంగా ఉండి నాలుగు అంగుళాల మేరకు నీళ్లు నిలిచిపోయాయి. అంతేకాకుండా నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆయన ఒక్కసారిగా అధికారులు, కాంట్రాక్టర్ పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం నిర్మాణంలో పూర్తిగా నాణ్యత లోపించిందని దీనికి బాధ్యు లు ఎవరంటూ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆయన నిలదీశారు. అక్కడ నుంచే ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పాలకొల్లులో వంద పడకల ఆసుపత్రి భవనాన్ని నిర్మించేందుకు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019లో రూ.12కోట్ల 60 లక్షలు నిధులను మంజూరు చేశారని, దీంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వంద పడకల ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. అప్పట్లో ఏడాది కాలంలో భవన నిర్మాణం పూర్తిచేసేలా టెండర్‌లో అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందన్నారు. దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారిందన్నారు. నిధులు ఉండి ఏడాది కాలంలో పూర్తి చేయాల్సిన భవనాన్ని వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కూడా పూర్తిచేయలేకపోయిందన్నారు.


అధికారులు, కాంట్రాక్టర్‌పై మంత్రి నిమ్మల ఆగ్రహం

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి పైలట్ ప్రాజెక్టు

» సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసమూర్తి

ఏలూరు క్రైం, జూలై 13 : కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారం కోసం పైలట్ ప్రాజెక్టుగా చర్యలు తీసుకున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ శనివారం ఉదయం పోలీసు అధికారులతో కో-ఆర్డినేషన్ మీటింగ్, వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించారన్నారు. ఈ కాన్ఫరెన్సులో తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారన్నారు. జిల్లాలో 1,291 నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని సత్వరమే అమలు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారన్నారు. 2014 నుంచి ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సాక్షులకు సమన్లను త్వరితగతిన అందించాలని వారికి రక్షణ కల్పించి సకాలంలో కోర్టులలో సాక్ష్యాలు చెప్పించాలన్నారు. అండర్ ట్రైల్ ప్రిజనర్స్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు కొన్ని సమయాల్లో పోలీసు దర్యాప్తు అధికారులు ఆ కేసులు ఉన్న ఇతర సాక్ష్యులు కోర్టులకు హాజరు కాకపోవడం వల్ల ఆలస్యం అవుతుందన్నారు. ఇలాంటి సమస్యలు అధిగమించడానికి పైలట్ ప్రాజెక్టు కింద పెట్టి కేసుల్లోని దర్యాప్తు అధికారులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా సాక్ష్యం చెప్పడం కాకుండా విచారణ కూడా చేస్తారన్నారు. దీని వల్ల త్వరితగతిన కేసులు పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఖైదీలను కూడా ఆన్‌లైన్ ద్వారానే ప్రవేశపెట్టి విచారణ చేస్తామన్నారు.


మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసమూర్తి




పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం
పాలా శ్రీనివాస్, డి.నాగదేవి

పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పాలా శ్రీనివాస్

భీమవరం రూరల్/యలమంచిలి, జూలై 13: పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం(గ్రేడ్1, గ్రేడ్5) అధ్యక్షుడిగా పాలా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా డి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దేవాబత్తుల నాగదేవి, కోశాధికారిగా సుంకర వెంకటేష్, ఉపాధ్యక్షులుగా జీవీఎల్ నర్సింహరావు, కె.వి.రామారావు, వి.కల్యాణి, సీహెచ్.చంటిబాబు, పి.వీర్రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఆర్.వి.బ్రహ్మం, బి.సతీష్‌కుమార్, వై.మునిరాజు, జి.వి.టి.నాయుడు, జి.రాధాలక్ష్మీప్రశాంతి, జాయింట్ సెక్రటరీలుగా ఎం.ప్రవీణ్‌కుమార్, జి.శ్రీనివాస్, డి.ఎస్.ఆర్.ప్రసాద్, జి.సుబ్బారావు, వంగా రాజులను ఇరవై మండలాల నుంచి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ఎన్నికైన కార్యవర్గాన్ని పంచాయతీ కార్యదర్శులు అభినందించి, సత్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా, యలమంచిలి పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్‌ను సర్పంచ్ బర్రే మేరీ, ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మి, తాళ్లూరి బుజ్జిబాబు తదితరులు అభినందించారు.

గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కేంద్ర బృందం పర్యటన


కేంద్ర బృందానికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

నరసాపురం రూరల్, జూలై 13:మండలంలోని వైఎస్‌పాలెం, రుస్తుంబాద, సీతారాంపురం గ్రామాల్లో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ కేంద్ర బృందం పర్యటించింది. ఉపాధి హామీ పథకం డైరెక్టర్ జి.జితేంద్రసింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ మౌనిక సింగ్ ఎంపిక చేసిన ఎన్ఆర్ఈజీఎస్ పనుల్ని తనిఖీ చేశారు. గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. పని దినాలు, ఇస్తున్న కూలీ, పనుల్లో నాణ్యత తదితర విషయాలపై ఆరా తీశారు. ఈమేరకు సర్పంచ్ నాగముత్యామాంబ, వెంకట్, భారతి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు వైఎస్ బాబు ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించాలని, కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపునకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని, ఉపాధి కార్మికులందరికీ మజ్జిగ సరఫరా చేయాలని వినతిపత్రం అందించారు. డ్వామా పీడీ ప్రభాకరరావు, డీఈ శ్రీనివాస్, ఆకన శ్రీదేవి వాసు, ప్రకాశ్, వై. సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా..

» కారు ఢీ కొని కొబ్బరి దింపు కార్మికుడి మృతి

ఆచంట, జూలై 13 :ఆచంట శివారు కౌరుపాలెం వద్ద కారు ఢీకొని పెనుమంచిలి శివారు ఇసుక గరువుకు చెందిన కొబ్బరి దింపు కార్మికుడు కర్ని సుందరరావు (55) మృతి చెందారు. ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. శనివారం సాయంత్రం పెనుమంచిలి నుంచి ఆచంట పెదపేటకు కర్ని సుందరరావు మోటారు సైకిల్‌పై బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఆచంట కౌరుపాలెం వద్ద చిన్న కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయా లయ్యాయి. స్థానికులు 108 వాహనంలో పాలకొల్లు ఆసుపత్రికి తీసుకెళు తుండగా మార్గమధ్యలో పోడూరు మండలం తూర్పుపాలెం వద్ద మృతి అతడు చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు కృష్ణంరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

జామాయిల్ చెట్టు కొమ్మ మీద పడి మహిళ మృతి

జంగారెడ్డిగూడెం, జూలై 13 : జంగారెడ్డిగూడెంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గుత్తుల వీరమణి(54) జామాయిల్ చెట్టు కొమ్మ విరిగి పడడంతో మృతి చెందిందని మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. స్థానిక రాజీవ్‌నగర్‌లో ఈనెల 12వ తేదీన ఉదయం గుత్తుల వీరమణి తమ ఇంటి నుంచి బయటకు వస్తుండగా పక్కనే ఉన్న జామాయిల్ చెట్టు పెద్దకొమ్మ విరిగి మీదపడడంతో స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఆమె కోడలు భర్తకు ఫోన్ ద్వారా సమాచారమందించడంతో కుమారుడు తన తల్లిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మళ్లీ స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆమె కుమారుడు గుత్తుల నాగమల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ట్రాలీ నుంచి దూసుకొచ్చి..

» త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కాకినాడ నుంచి ముంబైకి లోహపు పైపుల లోడుతో అశ్వారావుపేట వైపు వెళుతున్న ట్రాలీ లారీ జీలుగుమిల్లి సమీప నాలుగు రోడ్ల కూడలి వద్ద హైవేపై శనివారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. ఇటీవల హైవేపై మరమ్మతుల కోసం రోడ్డు తవ్వారు. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నందున పనులు నిలిచిపోయాయి. నీళ్లు చేరిన ఆ గోతుల్ని తప్పించే క్రమంలో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న లోహపు పైపుల్లో ఒకటి ముందుకు క్యాబిన్‌లోంచి చొచ్చుకుని బయటకు వచ్చింది. డ్రైవర్ అప్రమత్తమై ప్రమాదం బారి నుంచి బయట పడ్డాడు.
- జీలుగుమిల్లి



ఐసీఏఆర్-ఐఐఓపీఆర్ డైరెక్టర్ సురేష్, ఆర్‌టీఐ కమిషనర్ సునీల్‌కు శ్రీవారి చిత్రపటాలు అందిస్తున్న అధికారులు

వేంకటేశ్వరస్వామికి ప్రముఖుల పూజలు

ద్వారకాతిరుమల, జూలై 13:చినవెంకన్న ఆలయాన్ని ఐసీఏఆర్-ఐఐఓపీఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్) డైరెక్టర్ డాక్టర్ కంచర్ల సురేష్, సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ చావలి సునీల్ శనివారం సందర్శించారు. కుటుంబసమేతంగా విచ్చేసిన ఐసీఏఆర్-ఐఐఓపీఆర్ డైరెక్టర్‌కు, ఆర్‌టీఐ కమిషనర్ సునీల్‌కు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. తొలుత గర్భాలయంలో కొలువైన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు వారికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు వారికి శ్రీవారి చిత్రపటాలు, ప్రసాదాలు, మెమెంటోలను అందించారు.

11 మంది జూదరుల అరెస్టు

» 52 వేల 30 రూపాయలు స్వాధీనం

ఏలూరు క్రైం, జూలై 13 : ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న గ్రాండ్ ఆర్య హోటల్‌లో పేకాటాడుతున్న 11 మందిని అరెస్టు చేశామని ఏలూరు త్రీ టౌన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. శనివారం కొంతమంది పలు ప్రాంతాల నుంచి హోటల్‌కు వచ్చి పేకాటాడుతున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఆ హోటల్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి 52 వేల 30 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా పలు ప్రాంతాల నుంచి ఆ హోటల్‌కు వచ్చి పేకాట ఆడుతున్నట్టుగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

అత్తపై కత్తితో అల్లుడి దాడి.. కేసు నమోదు

ద్వారకాతిరుమల, జూలై 13: తన భార్య ఎక్కడికి వెళ్లిందో చెప్పమని అత్తతో గొడవకు దిగి ఆమెను కత్తితో నరకబోయిన అల్లుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. మండలంలోని తూర్ల లక్ష్మీపురానికి చెందిన గాది శేషమ్మకు ఇద్దరు సంతానం. గత కొంతకాలం క్రితం తన కుమార్తెను మండలంలోని ఐఎస్ రాఘవాపురానికి చెందిన బోడపాటి వెంకటేశ్వరరావుతో వివాహమైంది. భర్తతో వివాదం జరిగి ఈనెల 8న పుట్టింటికి వెళ్లింది. అదే రోజున ఉదయం వెంకటేశ్వరరావు తన అత్త శేషమ్మ ఇంటికి వెళ్లి తన భార్య ఎక్కడికి వెళ్లిందో చెప్పాలంటూ గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఆమెను కొట్టి కత్తితో పీకపై నరకబోగా ఆమె చేయి అడ్డు పెట్టడంతో మణికట్టు తెగిందని పోలీసులు తెలిపారు. బాధితురాలిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారని అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు అతడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బంధువుల చెంతకు తప్పిపోయిన యువతి

భీమవరం క్రైం, జూలై 13 : కాలేజీ నుంచి ఇంటికి తీసుకువస్తుండగా రైలులో తప్పిపోయిన యువతిని శనివారం రైల్వే పోలీసులు బంధువులకు అప్పగించారు. భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పీటీవీ రమణ తెలిపిన వివరాలివి.. కాళ్ళ మండలం ఆనందపురం గ్రామానికి చెందిన కొల్లాటి పెద్దిరాజు కుమార్తె కాకినాడ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. గత నెల 7వ తేదీన పెద్దిరాజు కాకినాడ వెళ్లి తన కుమార్తె కళ్యాణిని శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి తీసుకువస్తున్నారు. ఆ సమయంలో ఆమె తప్పిపోయింది. పెద్దిరాజు భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీసులకు గత నెల 12వ తేదీన ఫిర్యాదు చేయడంతో స్పెషల్ బృందాలు గాలించాయి. కళ్యాణి హైదరాబాద్‌లోని మాదాపూర్ పీజీ హాస్టల్‌లో ఉన్నట్టుగా గుర్తించి ఆమెను శనివారం భీమవరం తీసుకువచ్చారు. ఆమె తల్లిదండ్రులతో వెళ్ళడానికి నిరాకరించడంతో భీమవరంలో ఉమెన్ వెల్ఫేర్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి చేర్పినట్టుగా రైల్వే ఎస్ఐ రమణ తెలిపారు. కేసున చేధించి యువతిని గుర్తించినందుకు పోలీసులకు యువతి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

పాలకొల్లు రూరల్, జూలై 13 : దగ్గులూరు గ్రామంలో శనివారం ఉదయం జనగం సత్యనారాయణ నివాసంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఏసీ, ఫ్రిజ్, వంటగదిలోని వంట పాత్రలు కాలిపోయాయి. ఉదయం సమయంలో ఇంటికి తాళం వేసి అతడు తన భార్యతో కలసి పాలకొల్లు వెళ్లాడు. ఈక్రమంలో ఇంట్లోంచి పొగలు రావడంతో స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చిమంటలను అదుపు చేశారు. ఇంట్లో సామగ్రి పాక్షికంగా దగ్ధం అయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ శాగా సత్యనారాయణ పరామర్శించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల ఇటీవల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.


దగ్గులూరులో కాలిన ఇంట్లోని వస్తువులు

మారేడుబాకలో పూరిళ్లు దగ్ధం

కుక్కునూరు, జూలై 13: కుక్కునూరు మండల పరిధిలోని మారేడుబాక గ్రామంలో శుక్రవారం రాత్రి పిట్రా శాంతమ్మ, కుమ్మరిపల్లి అలివేలు అనే మహిళలకు చెందిన పూరిళ్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో ఇంటిలో ఉన్న పింఛన్ సొమ్ములు రూ.14వేలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రభుత్వ సాయం అందించాలని వారు కోరుతున్నారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం, జూలై 13 : పోలవరంలో గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణ, ప్రవర నదుల నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరిలో నీటిమట్టం రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతుంది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.040 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.190 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 27.130 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 16.180 మీటర్లు నమోదయ్యాయని ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7,080 క్యూసెక్కులు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,080 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు శనివారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.538 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20 పంపులు 20 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మహేష్

ఏలూరు టూ టౌన్, జూలై 13: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో శనివారం విద్యుత్ అధికారులతో మహేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అమరావతి ఏలూరు సమీపంలో ఉన్నందున పరిశ్రమల జోన్ వస్తుందన్నారు. అందుకు కావల్సిన విద్యుత్ ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఈ సాల్మన్‌రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాధాకృష్ణ, డీఈ నటరాజన్, డివిజన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ


భోజనం రుచి చూస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, జూలై 13 : బర్రింకలపాడు ఏపీ గిరిజన బాలుర పాఠశాలను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన, వసతి సౌకర్యాలు, మెను అమలు తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజన రుచి చూసారు. అన్నం సరిగ్గా ఉడక లేదన్నారు. దీంతోపాటు విద్యుత్ సౌకర్యం పాఠశాల్లో సరిగా లేదన్నారు. సరుకుల స్టాక్ రూం పరిశీలించారు. సిబ్బంది కొంత మంది అందుబాటులో లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమస్యలు మరోసారి తమ దృష్టికి రాకుండా పాఠశాల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు రోడ్లపై కన్పించకుండా బాధ్యతతో చదువు కొనసాగించాలని సూచించారు. అనంతరం వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. పాఠశాలతోపాటు పక్కనే ఉన్న కళాశాలను ఎమ్మెల్యే బాలరాజు సందర్శించారు.

ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు అర్బన్, జూలై 13 : సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కె.నాని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో శనివారం తరగతులు నిర్వహిస్తున్న పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల వద్దకు వెళ్లి విద్యార్థులను ఇళ్లకు పంపించివేసినట్టు తెలిపారు. రెండో శనివారం ప్రభుత్వ సెలవు అయినప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థలు తరగతులు నిర్వహిస్తున్నా విద్యా శాఖాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంటర్ బోర్డు ఆర్ఐవోకి ఫోన్ చేసి తరగతుల నిర్వహణ గురించి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు క్రాంతి, యశ్వంత్, చందన్ తదితరులు డిమాండ్ చేశారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం


కోండ్రు దేవ


జి.భారతి

చింతలపూడి, జూలై 13: చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా కోండ్రు దేవ, గుమ్మిశెట్టి భారతిని నియమిస్తున్నట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శనివారం ప్రకటించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా సభ్యులు కృషి చేయాలన్నారు. త్వరలో మరో ఇద్దరి సభ్యులను నియమిస్తామన్నారు. దీంతో పూర్తి స్థాయి కమిటీ ఏర్పడుతుందన్నారు. కాగా నియమితులైన సభ్యులు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

వీల్ చైర్ అందజేత

జంగారెడ్డిగూడెం, జూలై 13 : అంగ వైక ల్యం ఉన్న పేదలకు పనిముట్లు అందించడ మే 'అగాపే' స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకు డు బిరుదుగడ్డ ఆశి బాబు అన్నారు. అగాపే సంస్థ ద్వారా శనివారం తాడేపల్లిగూడెంకు చెందిన బత్తిన శ్రీనుకు ఆశిబాబు తన సొంత నగదు రూ.20 వేలతో కొనుగోలు చేసిన వీల్‌ఛైర్‌ను అందజేశారు. డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మాబూసుభానీ, డాంగే నగర్ యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి బాజీ పఠాన్, కొప్పాక రాజు, శ్రీను పాల్గొన్నారు.

కళాశాలలో చేరేందుకు గడువు పొడిగింపు

కామవరపుకోట, జూలై 13 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ కె.విజయబాబు తెలిపారు. ఈ నెల 23 నుంచి 26 వరకు ఆప్షన్ల ఎంపిక, 27న ఆప్షన్లలో మార్పులు చేసుకునేందుకు అవకాశం, 31న సీట్ల కేటాయింపు, ఆగస్టు ఒకటో తేదీన విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయాలని ప్రిన్సిపాల్ వివరించారు.

ఏడాది పాటు ఆశ్రం ఆసుపత్రి రజతోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ రతీదేవి

ఏలూరు టూ టౌన్, జూలై 13: ఆశ్రం ఆస్పత్రి రజతోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు ఉచితంగా, రాయితీలతో ఆపరేషన్లు, వైద్యాన్ని అందిస్తామని ఆశ్రం ఆస్పత్రి డైరెక్టర్ జి.రతీదేవి తెలిపారు ఆశ్రం ఆస్పత్రి ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రతీదేవి మాట్లాడారు. ఆస్పత్రిని 1999లో ఛైర్మన్ గోకరాజు గంగరాజు ప్రారం భించారన్నారు. తమ ఆస్పత్రిలో అత్యుత్తమ వైద్యం అందించేందకు ప్రపంచ స్థాయి డాక్టర్లు ఉన్నారని, ప్రస్తుతం క్యాన్సర్ విభాగం కూడా ప్రారంభిం చామన్నారు. సూపర్ స్పెషాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తు న్నామన్నారు. రజతోత్సవ కార్యక్రమాలు ఏడాది పాటు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది పొడవునా పేదలకు ఉచితంగా, రాయితీలతో వైద్యం అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, సీఈఓ డాక్టర్ కె.హనుమంతరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కె.శాంతయ్య, అకడమిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాలరాజు, సీఓఓ ఎస్.రాజరాజన్, వైద్యులు పార్థసారథి, కె.అంజిరెడ్డి పాల్గొన్నారు.

చేబ్రోలు లయన్స్ అధ్యక్షుడిగా ప్రకాష్

ఉంగుటూరు, జూలై 13 : చేబ్రోలు లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా నారాయణపురం గ్రామానికి చెందిన పుసులూరి ప్రకాష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథి టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ లయన్స్ సేవలను పల్లెలలో విస్తరించాలన్నారు.

కుసుమలతకు ప్రథమ స్థానం

ఉంగుటూరు, జూలై 13 : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ బిర్లా మందిరంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కేవీ రావు సొసైటీ అవార్డులలో కైకరం హైస్కూలు విద్యార్థిని నెర్సు కుసుమలత రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానం సాధించిందని హెచ్ఎం జి.ప్రసాదరావు తెలిపారు.

ముసునూరులో పట్ట పగలు చోరీ

ముసునూరు, జూలై 13: గ్రామంలోని బీసీ కాలనీలోని శనివారం పట్టపగలు ఒక ఇంట్లో చోరీ జరిగింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదురుగా నివాసముంటున్న చింతా రామకృష్ణ శనివారం ఉదయం 10 గంటల సమయంలో పశువులను మేతకు తోలుకెళ్లాడు. ఆయన భార్య ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లింది. రామకృష్ణ సాయంత్రం ఐదు గంటలకు పశువులను ఇంటికి తోలుకొచ్చే సరికి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తెరిచి రూ. లక్షా 50 వేలు విలువ గల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రరావు, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వైభవంగా కోలాట బృందాల గజ్జె పూజ

ద్వారకాతిరుమల, జూలై 13: చినవెంకన్న ఆలయ అనివేటి మండప ఆవరణలో ఏలూరుకు చెందిన కోలాట భజనబృంద సభ్యులు శనివారం సంప్రదాయ దుస్తులు ధరించి అనివేటి మండప ఆవరణలో గజ్జెలకు పూజలు చేశారు.

శ్రీవడలమ్మకు ఆషాఢం సారె సమర్పణ

నిడమర్రు జూలై 13 : భువ్వనపల్లి గ్రామ దేవత శ్రీవడలమ్మకు ఆషాఢం సారె సమర్పణ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

గత పాలకుల ఐదేళ్ల నిర్లక్ష్యం

» ఛిద్రమైన రహదారులతో ప్రజల పాట్లు » ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు


జంగారెడ్డి గూడెం సౌజన్య నగర్‌లో బురదతో ఉన్న రోడ్డు


చిన్నపాటి చెరువును తలపిస్తున్న జలపావారిగూడెంలోని రోడ్డు

జంగారెడ్డిగూడెం, జూలై 13 : గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. పట్టణంలో ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి పట్టణంలోని పలు రహదారులు ఛిద్రంగా మరాయి. శ్రీనివాసపురం రోడ్డులోని లక్ష్మీ నారాయణ థియేటర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు రోడ్డంతా గతుకులమయామే. ఇదే రహదారిలో ఏరియా ఆసుపత్రి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాళలున్నాయి. అంతేగాకుండా జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాలకు చెందిన అనేక గ్రామాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. వేలాది మంది నిత్యం ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే పాత బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వెనుక నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే సౌజన్య నగర్ రోడ్డు వర్షాలకు బురదమయంగా ఉండడంతో ద్విచక్ర వాహదారులు ప్రమాదాల పాలవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

● కామవరపుకోట : మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై గోతులు పడడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఉన్న గోతులలైనా పూడ్చాలంటూ ప్రజలు అభ్యర్థిస్తున్నారు. ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని తడికలపూడిలో పలు చోట్ల రోడ్లపై భారీ గోతులు పడడంతో కొద్దిపాటి చినుకులు పడినా గోతులన్నీ బురదమయమై వర్షపు నీటితో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. జలపావారిగూడెంలో రోడ్లపై గోతుల్లో వర్షపు నీరు ఉండడంతో రోడ్డు ఎక్కడో కూడా తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్లకు తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని మండల, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


పేదపాడులో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు, జూలై 13 : విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. వట్లూరులోని బాలయోగి గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే చింతమనేని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను, తరగతి గదులను పరిశీలించి అక్కడి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రోడ్డును అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న కూటమి శ్రేణులు

అప్పనవడులోని అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద, అద్భుత బాలఏసు పుణ్యక్షేత్రం వద్ద ఎమ్మెల్యేగా చింతమనేని ప్రభాకర్ గెలవడంతో కూటమి శ్రేణులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని కొబ్బరికాయలు కొట్టి స్వామికి పూజలు, ప్రార్థనలు చేశారు. గన్నవరం నియోజకవర్గం జనసేన సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి : గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు, తరగతి గదులను చూశారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. నాణ్యతలేని సరుకులను పరిశీలించిన ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాలయంలో అదనపు సెక్షన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో మరో రెండు గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నామని ఆయన వివరించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.భారతికి, శిథిలావస్థలో ఉన్న అధ్యాపకుల నివాస గృహాల మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ కోటేశ్వర రావుకు ఎమ్మెల్యే ప్రభాకర్ సూచించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ వైవీఎస్ ఆచార్యులు, సర్పంచ్ మేకా కనకరాజు, మాజీ సర్పంచ్ రంగారావు, కొనకళ్ల శివమణి, బళ్లారి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి దాతల కృషి ఎనలేనిది

పేదల ఆరోగ్యానికి దాతలు అందిస్తున్న కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే చింతమనేని అన్నారు. ముండూరుకు చెందిన బలుసు లక్ష్మణ రమేష్, దివ్యశ్రీ దంపతుల కుమారుడు దీపు శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏలూరు ఆంధ్రా ఆస్పత్రి సహకారంతో ముండూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సాధారణ వ్యాధుల తోపాటు మూత్ర, గుండె సంబంధ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. పలువురు దాతలు రక్తదానం చేశారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రారంభించారు. వైద్యులు ఎంఎల్‌వీ ప్రసాద్, శర్వాణి, స్వరూప్‌రెడ్డి, హరికృష్ణ వైద్య సేవలు అందించారు. టీడీపీ నేతలు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, పర్వతనేని రాజరాజేశ్వరి, అన్నపనేని సురేష్, ఆళ్ల కార్తీక్, నెక్కలపూడి సురేష్‌బాబు, ఉప్పులూరి రామరాజు సామ్రాజ్యం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

● ఏలూరు అర్బన్ : సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న పార్ట్ టైం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రభాకర్‌ను క్యాంపు కార్యాలయంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లందరినీ రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనంగా రూ.33 వేలు ఇవ్వాలని, తదితర సమస్యలపై ఎమ్మెల్యేను అభ్యర్థించినట్టు ఏపీ సమగ్రశిక్ష పార్ట్‌టైం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు తెలిపారు. తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్లే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని వివరించారు. బాలాజీ, సుబ్బారావు, జాన్‌రాజు, రజనీకాంత్, హేమ, రేణుకేశ్వరరావు, డి.సుబ్బారావు తదితరులున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


ఎమ్మెల్యే రోషన్ కుమార్‌ని సన్మానిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం, జూలై13 : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ చింతలపూడి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం కాండ్రేగుల చిన్నారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ జంగారెడ్డిగూడెంలో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి రూ.లక్ష మండల జనసేన అధ్యక్షుడు ఆకుల రాకేష్ రూ.25 వేలు విరాళంగా ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే రోషన్ కుమార్‌ను జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ శంకర్రావు, నాయకులు జి.శ్రీనివాసరావు, ఎస్‌డీ.జబీర్, సీఎస్‌వీ రామారావు, రవికిరణ్, లోకేష్, రాజేష్, కుమారస్వామి, కూటమి నాయకులు ఎం.లక్ష్మణరావు, పి.సత్తిపండు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో కార్డియాక్ సేవలు

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విజయవాడకు చెందిన పీవీఆర్ కార్డియాక్ మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి సేవలను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పీవీఆర్ ఆస్పత్రి వైద్యులు ఇక్కడ సేవలు అందిస్తారన్నారు. త్వరలోనే జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో కూడా ఆ సేవలు ప్రారంభిస్తామన్నారు. తొలి క్యాంప్‌లో పీవీఆర్ ఆస్పత్రి వైద్యులు పి.వెంకటరామ చౌదరి, ప్రవీణ్, 50 మందికి కార్డియాక్ పరీక్షలు ఉచితంగా చేశారు. డీసీహెచ్ఎస్ పాల్‌సతీష్ కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రసూల్, టీడీపీ నాయకులు పక్కాల వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, ఎస్.ఎస్.ఎన్ గాంధీ, టీఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తాం


శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూలై 13: నగరంలో ఉన్న శ్మశానవాటికలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అశోక్ నగర్‌లోని శ్మశాన వాటికను శనివారం ఆయన సందర్శించారు. చంటి మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు కక్ష సాధింపు చర్యలుగా శ్మశానాలు ధ్వంసం చేశారని మండిపడ్డారు. ఫ్లాష్ సంస్థ నిర్వాహకులు వై.శ్రీనివాస్ లాంటి దాతల సహకారంతో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామన్నారు. చోడే వెంకటరత్నం, పూజారి నిరంజన్, నాగేశ్వరరావు, ప్రసాద్, పాండు రంగారావు, పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చంటికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. సాయిబాబు, జగన్నాథరావు, సాంబశివరావు, సత్యనారాయణ, సాయి, సుబ్బారావు, సూరిబాబు, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు దోహదం

కామవరపుకోట, జూలై 13 : ప్రతి ఇంటా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని స్కౌట్స్ శిక్షకులు బి.నాగేశ్వరరావు అన్నారు. రావికంపాడు జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో శనివారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కౌట్స్ విద్యార్థులు మొక్కలు నాటారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, స్థానికులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


బి.సుజన్ ఇవాంజెలిన్


ఎం.సాంబశివరావు

పెదపాడు, జూలై 13 : అప్పనవీడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లుగా హెచ్ఎం తోట పుష్పవతి తెలిపారు. బల్లారపు సుజన్ ఇవాంజెలిన్ నూజివీడు ట్రిపుల్ ఎంఐటీలో, ఎం.సాంబశివరావు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు. విద్యార్థులను ఎంఈవోలు సబ్బితి నరసింహామూర్తి, దేవినేని వెంకటరమణ, హెచ్ఎం పుష్పవతి, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ చింతా రమాదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు అభినందించారు.

● ఉంగుటూరు : కైకరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి పొడుగు జస్వంత్ కార్తీక్‌కు ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో సీటు లభించినట్లు హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. కార్తీక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

● టి.నరసాపురం : అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల విద్యార్థులు తొమ్మిది మంది ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డీఎస్ బి.శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి నలుగురు, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి నలుగురు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఒక విద్యార్థి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కల్యాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పైలాదాస్ వ్యాఖ్యల పై భగ్గుమన్న బ్రాహ్మణ సంఘాలు


ఆందోళన చేస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

ఏలూరు రూరల్, జూలై 13: పార్వతీపురం నియోజకవర్గంలోని సివినీ గ్రామంలో ఉండే పైలాదాస్ అనే వ్యక్తి బ్రాహ్మణులను కించపరుస్తూ దుర్భాషలాడటాన్ని నిరసిస్తూ శనివారం వసంత మహల్ సెంటర్లో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ హైందవ సంస్కృతిని దెబ్బతీసేలా బ్రాహ్మణులను వేశ్యపుత్రులని సంబోధిస్తూ తీవ్రంగా అవమానించిన పైలాదాస్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పోలీస్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఎంబీఎస్ శర్మ, మైలవరపు గురుశర్మ, కె.కృష్ణమాచార్యులు, తురగా రామకృష్ణ, తోలేటి శ్రీనివాస్, కె.తాయారు, సీఏపీ రామానుజాచార్యులు, కె.మదన్, ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సరికాదు

ఏలూరు రూరల్, జూలై 13: రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, శ్రీయజ్ఞవల్క్య ఆశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణశరణానంద భారతి అన్నారు. వీహెచ్‌పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ హిందువులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు చక్రధర్‌రావు, శాస్త్రి, నాగరాజు, రాజనాల రామచంద్రరావు, పలువురు బీజేపీ, హిందు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఛైర్మన్ పదవి కేటాయించండి


శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కిలారు సత్యనారాయణ

కామవరపుకోట, జూలై 13 : చింతలపూడి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ కామవరపుకోట టీడీపీ మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఖాన్ వజీర్, ఘంటా గోపి, జిజ్జూరి బాబ్జి ఉన్నారు.

నేడు జూబ్లీ నగర్‌లో ఆయుష్ ఉచిత వైద్య శిబిరం

ఏలూరు అర్బన్, జూలై 13 : ఏలూరు పీఠం సోషల్ సర్వీస్ సెంటర్, ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లింగపాలెం మండలం జూబ్లీ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిరకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు, ఈసీజీ తీస్తామని వివరించారు.

ఉచిత ఆర్థో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీకృష్ణ

ఏలూరు రూరల్, జూలై 13: స్థానిక శ్రీకృష్ణ ఆసుపత్రిలో ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహి ంచారు. డాక్టర్ శ్రీకృష్ణ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాని కి దూరమైన నిరుపేదలకు చేయూత ఇచ్చే లక్ష్యంతో ప్రతినెల రెండో శనివారం శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉప్పు వాడకం తగ్గించాలని, అప్పుడే ఆర్థో వ్యాధులు నివారించ వచ్చన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా ఎక్స్‌రే, ఎముకల సాంద్రత, రక్తపరీక్షలు నిర్వహించారు.

88 మందికి వైద్య సేవలు

ఏలూరు కార్పొరేషన్, జూలై 13 : స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో ఆయుష్ వైద్యాధికారి బీవీఎం నగేష్ 88 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా లయన్స్ గవర్నర్ కాకరాల వేణుబాబు, విష్ణుకుమార్, బొలిశెట్టి సురేష్‌కుమార్, పర్సా శ్రీనివాస్, చెన్న వెంకట్రామయ్య, పిల్లి పండరీనాథ్ విఠల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుధీర్‌బాబు జన్మదిన వేడుకలు


సుధీర్‌బాబుతో కేక్‌ను కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్ తదితరులు

కామవరపుకోట, జూలై 13 : కామవరపుకోట జడ్పీటీసీ మాజీ సభ్యులు ఘంటా సుధీర్‌బాబు జన్మదిన వేడుకలు శనివారం పాతూరులో ఆయన నివాస గృహంలో ఘనంగా నిర్వహించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, కోనేరు వెంకట్రామయ్య(బుజ్జియ్య), ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, తెలుగు రైతు ఏలూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు సుధీర్‌బాబుతో భారీ బర్తడే కేక్‌ను కట్ చేయించి వేడుక జరిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, కొవ్వూరు, గోపాలపురం, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, బొలిశెట్టి శ్రీనివాస్, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తదితరులు ఉన్నారు. కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో విచ్చేసి సుధీర్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తొలుత కొండగూడెంకు చెందిన టీడీపీ నాయకులు పందు జగదీష్, బొబ్బిలి డాన్ దివాకర్, మల్లెల్లి బాలస్వామి, కాంతారావు, నాగరాజు, బిరుదుగడ్డ రాజేష్, రవి, లేటు ఇజ్రా యిల్, మాదాసు బాల సుందరం, జి.మధు, బండి ధర్మారావు, సర్వేశు, నల్లవెలుగుల మోహన్‌రావు, కనకాంబరం, లింగాల రాజు, నిట్టా అంజి, ఆడమిల్లి వీర్రాజు, జనతా ఎలక్ట్రానిక్స్ అధినేత కె.సాల్మన్‌రాజు బృందం సుధీర్ బాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి వేదిక వద్దకు తీసుకువచ్చారు.

ఆంధ్రా కాలువ మరమ్మతుల పై ఎంపీకి వినతి

చింతలపూడి, జూలై 13: తెలంగాణ సరిహద్దులో ఉన్న మండలంలోని ఆంధ్రా కాలువ మరమ్మతులు చేపట్టి 24 సాగునీటి చెరువుల ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు ఏలూరు పార్లమెంట్ తెలుగుదేశం రైతు సంఘ అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. తమ్మిలేరు ఎగువన తుమ్మూరు ప్రాజెక్టు నుంచి ఆంధ్రా వైపునకు వచ్చే ఎడమ కాలువలో పూడిక తీయించి, గట్లు ఎత్తు పెంచి, గట్టు పై రోడ్డు నిర్మాణం చేపట్టి, చెరువులకు సాగునీరు మళ్లిస్తే 24 సాగునీటి చెరువుల కింద 15 వేల ఎకరాల సేద్యం జరుగుతుందని ఎంపీకి తెలిపానన్నారు. అంతేగాక లింగసముద్రం చెరువుకు, తుమ్మూరు చెరువు నుంచి ఎండపల్లి చెరువుకు కాలువ తవ్వాలని, మొండికుంట తూము ఏర్పాటు చేయాలని దీని వల్ల ఆంధ్రా కాలువ పరిధిలో ఉన్న సాగునీటి రైతులకు మెరుగైన నీటి సౌకర్యం జరుగుతుందని, వీటికి వెంటనే నిధులు కేటాయించే విధంగా రైతులకు సహకరించాలని కోరినట్లు తెలిపారు.

24 గంటల్లో సమస్యకు పరిష్కారం

ఏలూరు సిటీ, జూలై 13: కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాట్సాప్ నెంబర్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఏలూరు -జంగారెడ్డిగూడెం రహదారిలో ఉప్పలపాడు వద్ద ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ వి.మధు సందేశాన్ని పంపడంతో అధికార యంత్రాంగం 24 గంటల్లోనే ఆ చెట్లను తొలగించారు. ఇదే విషయంపై రెండేళ్లుగా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని మధ తెలిపారు. కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఏలూరు రూరల్, జూలై 13: స్థానిక పవర్‌పేటలోని హిందీ నికేతన్ వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించారు. హిందీ నికేతన్ అధ్యక్షుడు వి.వెంకటస్వామి, కార్యదర్శి కవితా కుమారి ప్రతి విద్యార్థి పద్య పఠనం నిరంతరం చేయాలని సూచించారు. అనంతరం 66 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఎం.మోహన్‌కుమార్, హిందీ పండితులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సమావేశం

ఏలూరు రూరల్, జూలై 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక వీరమాచినేని వెంకటనారాయణ భవనంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పెనుమాక వెంకటసుబ్బారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమస్యలను తెలిపేందుకు రెవెన్యూ శాఖా మంత్రి సత్యప్రసాద్‌ను కలిసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి దాసరి సుధాకర్, సత్యనారాయణ, నాయకులు వీవీఎస్ సుబ్బారావు, ప్రసాద్ రామకృష్ణ, నాగభూషణం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

జీపీఎస్ కాపీలు దగ్ధం

ఏలూరు అర్బన్, జూలై 13 : కూటమి ప్రభుత్వం పాత తేదీతో జీపీఎస్‌ను అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని నిరసిస్తూ యూటీ ఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సంఘ నాయకులు, ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. ఏలూరులోని సంఘ జిల్లా కార్యాలయం ఎదుట జీపీఎస్ జీవో కాపీలను దగ్ధం చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ పాల్గొన్నారు.

● జీపీఎస్‌ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 54 ఉత్తర్వులను విడుదల చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఏపీటీఎఫ్ నగర శాఖ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు తెలిపారు.

● ఏలూరు రూరల్ : ఈనెల 16న జరిగే రాష్ట్రక్యాబినెట్ సమావేశంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన జీపీఎస్ విధానాన్ని గెజిట్ నోటిఫికేషన్ ద్వారా రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



కలిదిండిలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రైతు బజార్

రైతు బజార్ పూర్తిచేయరూ..

టీడీపీ హయాంలోనే 70 శాతం నిర్మాణం పూర్తి

కలిదిండి, జూలై 13 : కలిదిండిలో అసంపూర్తిగా ఉన్న రైతు బజార్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. 2018లో టీడీపీ హయాంలో రైతు బజార్ నిర్మాణం చేపట్టి 70 శాతం పనులు పూర్తి చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో 10 శాతం పనులు మాత్రమే చేశారు. రైతు బజార్ అసంపూర్తిగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రేయింబవళ్లు మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. తాగి పడవేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లను ఆవరణంలో పడవేస్తున్నారు. సాయంత్రం వేళ మహిళలు అటు వైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. టీడీపీ హయాంలో అప్పడు మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్, ఏఎంసీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి రూ.42 లక్షలతో రైతు బజార్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి 70 శాతం పనులు పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బజార్ నిర్మాణం పూర్తి కాకపోవటంతో కూరగాయలు పండించే రైతులు పలు అవస్థలు పడుతున్నారు. కైకలూరు, గుడివాడ, ఏలూరు బస్సుల్లో కూరగాయలను తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. బయట మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రైతు బజార్ నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ యార్డు కార్యదర్శి ఏమన్నారు?

ఈ విషయమై మార్కెట్ యార్డు కార్యదర్శి వరలక్ష్మిని వివరణ కోరగా, రైతు బజార్ నిర్మాణ పనులు పూర్తి చేయటానికి రూ.27 లక్షలు మంజూరయ్యాయని టెండర్ల కార్యక్రమం పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు చేపడతారన్నారు.



మేలైన యాజమాన్యంతో ముందస్తు మామిడి

చాట్రాయి, జూలై 13: మామిడిని ముందస్తుగా కాపు కాయించి లాభాలు పొందుతున్నారు కొందరు ఔత్సాహిక రైతులు. సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ మొదటి వారం నుంచి మామిడి సీజన్ ప్రారంభం అవుతుంది. సీజన్ మొదట్లో టన్ను ధర రూ. లక్ష పలుకుతుంది. అప్పుడు మామిడి పంట తేగలిగిన రైతుకు కాసుల పంటే. తరువాత ధర క్రమంగా తగ్గుతూ సీజన్ ఆఖరుకి రూ 15-20 వేలకు పడిపోవటం షరా మామూలు. శాస్త్రవేత్తల సిఫార్సులకు అనుగుణంగా మామిడికోత పూర్తి కాగానే ఎండుపుల్ల తొలగించి కాల్చి వేస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో తోటల్లో మడికట్టు కట్టి, దుక్కి దున్ని అద్దంలా తయారు చేస్తున్నారు. అవసరం మేరకు నీటి తడులు ఇస్తూ ఎరువులు వేసి, పురుగు మందులు స్ప్రే చేస్తుండటంతో పంట ముందుగానే వచ్చి అధిక ధరకు అమ్ముకొని రైతులు లాభాలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



వర్షాలకు ముదినేపల్లి ప్రాంతంలో తేరుకున్న వెదజల్లిన వరి పైరు

వెదజల్లిన వరి పైరుకు జీవం

ముదినేపల్లి, జూలై 13: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ముదినేపల్లి మండలంలోని వెదజల్లిన సార్వా వరి పైరుకు జీవం పోశాయి. వేలాది ఎకరాల్లో 20 రోజుల క్రితం వెదజల్లిన వరి విత్తనాలు తరచూ కురుస్తున్న కొద్దిపాటి వర్షానికి మొలకెత్తినా వారం రోజుల నుంచి వర్షాలు ఆశాజనకంగా లేకపోవటం, సాగునీరు అందుబాటులోకి రాకపోవటంతో వరి పైరు ఎండిపోయింది. పొలాలు కూడా బీటలు వారాయి. ఈ పరిస్థితుల్లో శుక్రవారం నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ఎండిపోతున్న వెదజల్లిన వరి పైరుకు జీవం పోసినట్టయింది. కొంత విస్తీర్ణంలో ఇప్పటికే పైరు పాడైపోయింది. ఆ భూముల్లోని ఖాళీ ప్రదేశంలో వరి నాట్లు వేసుకోవాల్సిందేనని రైతులు చెబుతున్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



మృతులు చావలి దుర్గా ప్రసాద్, బోదావుల సాయి దుర్గా ప్రసాద్ (ఫైల్)

కలిదిండి(కైకలూరు) జూలై 13 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అసువులు బాశారు. కైకలూరు మండలం వేమవరప్పాడుకు చెందిన చావలి దుర్గాప్రసాద్ (19), బోదావుల సాయి దుర్గాప్రసాద్ (18)లు స్నేహితులు. వీరిద్దరూ శుక్రవారం రాత్రి పనిమీద బైక్‌పై కోరుకొల్లు వెళ్లి తిరిగి వస్తుండగా వేమవరప్పాడు సమీపంలో రోడ్డు పక్కన ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి ఇద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చావలి దుర్గాప్రసాద్ చికిత్స పొందుతూ మృతి చెందగా బోదావుల సాయి దుర్గాప్రసాద్‌ను మెరుగైన చికిత్సకు ఏలూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముసునూరులో పట్టపగలు చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

ముసునూరు, జూలై 13: ముసునూరు బీసీ కాలనీలో శనివారం పట్టపగలు చోరీ జరిగింది. బీసీ కాలనీలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఎదురుగా చింతా రామకృష్ణ నివాసం ఉంటున్నాడు. ఆయన శనివారం ఉదయం 10 గంటల సమయంలో పశువులను మేతకు తోలుకెళ్లాడు. ఆయన భార్య ఇంటికి తాళం వేసి ఊరు వెళ్ళింది. రామకృష్ణ సాయంత్రం ఐదు గంటలకు పశువులను ఇంటికి తోలుకొచ్చే సరికి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. లోనికి వెళ్ళి చూడగా బీరువా తెరిచి రూ. లక్షా 50 వేలు విలువ గల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.వాసు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రరావు, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.



పెదగొన్నూరులో జలమయమైన ఆర్అండ్‌బీ రహదారి



వడాలిలో ప్రధాన రహదారి గోతుల్లో నిలిచిన వర్షపు నీరు



మండవల్లి ప్రాథమిక పాఠశాల-1లో చేరిన నీరు



పెదగొన్నూరులో రహదారిపై నీటి పారుదలకు డ్రెయిన్ తవ్వకం

వానొస్తే అంతే..

ముదినేపల్లి, జూలై 13 : వర్షాలకు రహదారులు జలమయం అవుతున్నాయి. పెదగొన్నూరు గ్రామంలోని ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవటంతో వర్షపు నీరు రోజుల తరబడి రహదారిపైనే నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన వ్యాపిస్తోంది. శనివారం గ్రామంలోని కూటమి నాయకులు పలువురు స్వచ్ఛందంగా ఎక్స్‌కవేటర్‌తో రోడ్ పక్కన డ్రెయిన్ తవ్వకం పనులు చేయించారు. వడాలి, చిగురుకోట రహదారి గోతుల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచి ఉంది. బయటికిపోయే మార్గం లేదు. ముదినేపల్లిలోని పలు అంతర్గత రహదారులు జలమయమయ్యాయి.

పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు..

మండవల్లి: మండవల్లి ప్రాథమిక పాఠశాల-1లో ఆవరణలో వర్షం నీరు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాల ఆవరణలో మెరక పనులు చేసినప్పుడు రెండు భవనాల వెనుక పూడిక చేయకపోవడంతో పాఠశాల ఆవరణలోకి వర్షం నీరు చేరుతోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ విషయంపై పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ట్రాక్టరు వెళ్లకపోవడంతో మెరక చేయలేకపోయారని త్వరలో కూలీలను పెట్టి చేయిస్తామని చెప్పి అధికారులు మాట దాటవేశారని, ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వర్షం కురిసినప్పుడు ఈ పల్లం ప్రదేశంలోకి నీరు చేరి రోజుల తరబడి ఉండటం వలన భవనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ

విచారణ నిర్వహించిన డ్వామా పీడీ తదితర అధికారులు



ఉపాధి పనులపై విచారణ చేస్తున్న అధికారులు

నూజివీడు, జూలై 13: ఉపాధి పనుల్లో అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులు శనివారం విచారణ చేపట్టారు. నూజివీడు మండలం మీర్జాపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ విమలాదేవి ఉపాధి పనుల నిర్వహణలో పలు అక్రమాలకు పాల్పడ్డారంటూ అందిన ఫిర్యాదుపై డ్వామా పీడీ ఎ. రాము, ఏపీడీ శ్రీదేవి, డీబీటీ మేనేజర్ నరేష్ శనివారం మీర్జాపురంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి జాబ్ కార్డుల జారీలోనూ ఫీల్డ్ అసిస్టెంట్ విమలాదేవి ఒక్కొక్కరి నుంచి 500 వసూలు చేశారని, మేట్ల ద్వారా నగదు వసూలు చేశారని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే పని చేయని వారికి మస్తర్లు వేసి నగదు వసూలు చేశారని, అనేక మందికి నగదు చెల్లింపులు చేయలేదంటూ గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఫిర్యాదులను స్వీకరించి మరోసారి విచారణ నిర్వహించనున్నట్టు రాము తెలిపారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు తమ విచారణకు సంబంధించిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్టు ఆయన పేర్కొన్నారు. నూజివీడు ఏపీవో ఎన్.సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



హనుమంతులగూడెం అంగన్వాడీలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

పర్యావరణ పరిరక్షణకు అంగన్వాడీలు కృషి చేయాలి

నూజివీడు టౌన్, జూలై 13: అంగన్‌వాడీ కేంద్రాలు పర్యావరణ సంరక్షణకు సైతం కేంద్రాలుగా మారాలని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం నూజివీడు మండలం దిగవల్లి సెక్టార్ పరిధిలోని హనుమంతులగూడెంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచం కాంక్రీట్ అరణ్యాలుగా మారుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రతి చిన్నారి, వారి తల్లిదండ్రులతో ఒక్కో మొక్కను నాటిస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



గోపవరంలో మంచినీటి ట్యాంకు శుభ్రత.. కాల్వల్లో బ్లీచింగ్ పనులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముసునూరు, జూలై 13: గోపవరంలో పారిశుధ్యం అధ్వానం... శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం యుద్ధప్రాతిపదికన గోపవరంలో అన్ని కాలనీల్లో పారిశుధ్యం మెరుగుకు కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వర రావు, సుకుమార్ చర్యలు చేపట్టారు. బీసీ, ఎస్సీ కాలనీల్లోని మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేసి, నీటి పరీక్షలు నిర్వహించారు. అలాగే రహదారులపై చెత్తాచెదారం, డ్రైనేజీల్లో మురుగునీటి నిల్వలను తొలగించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అన్ని కాలనీల్లో బ్లీచింగ్ చల్లారు. మంచినీటి ట్యాంక్‌ల వద్ద ఉన్న తుప్పలను శుభ్రం చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. అతి తక్కువగా సాధారణ జ్వరాలు ఉన్నాయని సిబ్బంది తెలిపారు. రెండు రోజుల్లో గ్రామంలో ఫాగింగ్ చేసి, డ్రైనేజీ పూడికతీత పనులను చేపడతామని కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు.

పేదలకు పట్టెడన్నం పెట్టడమే టీడీపీ లక్ష్యం



కలిదిండి (కైకలూరు) జూలై 13 : పేదలకు పట్టెడన్నం పెట్టడమే టీడీపీ లక్ష్యమని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కె. కోటిలింగం బాబు అన్నారు. శనివారం కోటిలింగం జన్మదినం సందర్భంగా కైకలూరు అన్న క్యాంటీన్లో పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, కూటమి నాయకులు పూల రాజీ, వీరాబత్తిన సుధా, కొల్లి బాబి, మంగినేని రామకృష్ణ, కరేటి శ్రీహరి, కంచర్ల రామకృష్ణ, తోట లక్ష్మి, అద్దంకి రమేష్, పుప్పాల సూర్యప్రకాశరావు, పడమట వాసు, నంగెడ్డ పవన్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాతో అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, జూలై 13 : డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి ఒక ప్రకటనలో తెలిపారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గుంతల్లో నిల్వ ఉన్న నీరు తొలగించాల న్నారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. తరచూ విరేచనాలు అవుతుంటే సమీపంలో పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స పొందాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు స్వచ్ఛ నీరు, తాజా ఆహారం ఇవ్వాలన్నారు.



దూరంగా తరలించేందుకు కోతులను పట్టుకున్న దృశ్యం

కోతుల బెడద నివారణకు ట్రిపుల్ ఐటీ చర్యలు

నూజివీడు టౌన్, జూలై 13: నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ ప్రాంగణంలో కోతుల బెడదనివారణకు ఆర్జీయూకేటీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఇటీవల కాలంలో క్యాంపస్‌లో కోతుల బెడద ఎక్కువవటంతో విద్యార్థులు భయాందోళనలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లాకు చెందిన 8 మంది బృందంతో ట్రిపుల్ ఐటీ అధికారులు కోతులను ప్రత్యేక బోనుల్లో బంధించి అడవుల్లో వదిలేందుకు ఏర్పాట్లు చేశారు.



రాష్ట్ర ప్రగతికి కూటమి బాటలు : అండ్రాజు

కలిదిండి, జూలై 13 : ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యం లో కూటమి ప్రభుత్వం నెల రోజుల్లో 30 కార్యక్రమాలతో రాష్ట్ర ప్రగతికి, ప్రజా సంక్షేమానికి బాటలు వేసిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అండ్రాజు శ్రీనివాస్ అన్నారు. శనివారం మట్టగుంటలో టీడీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా మొదటిగా నిరుద్యోగులకు మెగా డీఎస్సీ విడుదల, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలు విముక్తి పొంది చంద్రబాబు నెల రోజుల పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు నాగిడి వీరబ్రహ్మం, అండ్రాజు దుర్గారావు, తిరుమాని గోపాలకృష్ణ, పాండురంగారావు, తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, వడుగు గణపతి, ఈశ్వర పరశు రాముడు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్‌ను రద్దు చేయాలి

ఆగిరిపల్లి, జూలై 13: ఓపీఎస్‌కు బదులుగా గత ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కలపాల అజరయ్య కోరారు. ఎన్నికలు అయ్యేంతవరకు గెజిట్ నోటిఫికేషన్‌ను బయటకు రానివ్వకుండా గత సంవత్సరం అక్టోబర్ 20 నుంచి అమల్లో ఉన్నదని చెప్పడం ఉపాధ్యాయులను మోసం చేసినట్లేనని కొత్త ప్రభుత్వం దీనిపై ఒక నిర్ణయం తీసుకుని వెంటనే నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరారు. అలాగే సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలో భాగమైన జీవో నెంబర్ 54ను రద్దుచేసి అందరికి ఆమోదయోగ్యమైన పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

హీల్ విద్యార్థులకు పతకాలు

ఆగిరిపల్లి, జూలై 13: విశాఖలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని తోటపల్లిలో గల హీల్ అంధ పాఠశాల విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులు చింతా ప్రవీణ్, నరసింహ, జె.వరలక్ష్మి, జి.మధు, సీహెచ్ హరి, ఆకాష్, కె.సునీల్, శివనాగరాజు పరుగు పందెం, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో పాల్గొని పతకాలు సాధించడంతో హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈవో కూరపాటి అజయ్ కుమార్, ప్రిన్సిపాల్ బి.సాయిబాబు, ఎస్.రుష్మంత్, నాగరాజు, ప్రభుదాసు, ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



ఆగిరిపల్లి, జూలై 13: స్థానిక ఎస్ఆర్ఐ కళాశాల ఆధ్వర్యంలో శనివారం జగన్నాథ రథ యాత్ర కన్నుల పండువగా జరిగింది. ఇస్కాన్ ఆలయంలోని స్వామివారిని వందలాది మంది విద్యార్థులు, భక్తులు జయజయ ధ్వానాల మధ్య కళాశాల ప్రాంగణం నుంచి నెక్కలం అడ్డరోడ్డు లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి రథాన్ని తోడ్కొని వెళ్లారు. ఎస్ఆర్ఐ కళాశాల ఛైర్మన్ రావి వెంకటరావు, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

నూజివీడు టౌన్, జూలై 13: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఆ పార్టీ నాయకుడు ఎం.సునీల్‌కుమార్ కోరారు. ఈ నెల 18 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని, సభ్యత్వం ద్వారా రూ. 5 లక్షలు ప్రమాద బీమా, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50 వేలు వైద్య ఖర్చులు అందిస్తున్న ఏకైక పార్టీ జనసేన అన్నారు.

ఏడాది పాటు ఆశ్రం ఆసుపత్రి రజతోత్సవాలు



మాట్లాడుతున్న డైరెక్టర్ రతీదేవి

ఏలూరు టూ టౌన్, జూలై 13: ఆశ్రం ఆస్పత్రి రజతోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు ఉచితంగా, రాయితీలతో ఆపరేషన్లు, వైద్యాన్ని అందిస్తామని ఆశ్రం ఆస్పత్రి డైరెక్టర్ జి.రతీదేవి తెలిపారు. ఆశ్రం ఆస్పత్రి ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఆస్పత్రిని 1999లో ఛైర్మన్ గోకరాజు గంగరాజు ప్రారంభించారన్నారు. తమ ఆస్పత్రిలో అత్యుత్తమ వైద్యం అందించేందుకు ప్రపంచ స్థాయి డాక్టర్లు ఉన్నారని, ప్రస్తుతం క్యాన్సర్ విభాగం కూడా ప్రారంభించామన్నారు. సూపర్ స్పెషాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రజతోత్సవ కార్యక్రమాలు ఏడాది పాటు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, సీఈఓ డాక్టర్ కె.హనుమంతరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కె.శాంతయ్య, అకడమిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాలరాజు, సీఓఓ ఎస్.రాజరాజన్, వైద్యులు పార్థసారథి, కె.అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు



చెక్కపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

ముసునూరు, జూలై 13: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఐదు రోజులుగా ఒక మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో వరినాట్లు ఊపందుకున్నాయి. మండల వ్యాప్తంగా 4350 వ్యవసాయ బోర్లు ఉండగా వీటి కింద ఉన్న సుమారు 7 వేల ఎకరాల ఆయకట్టులో వరినాట్లు వేసేందుకు ఈ ఏడాది 225 ఎకరాల్లో వరి నారుమడులు రైతులు సిద్ధం చేశారు. చెక్కపల్లి, గుళ్ళపూడి, గుడిపాడు, వలసపల్లి, గోపవరం, కాట్రేనిపాడు తదితర గ్రామాల్లో వరినాట్లు ప్రక్రియ సాగుతోంది. ఇప్పటివరకు సుమారు 200 ఎకరాల్లో నాట్లు పూర్తయినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో అన్ని గ్రామాల్లో నాట్లు ముమ్మరంగా సాగే అవకాశం ఉందని తెలిపారు. చెరువు ఆయకట్టులో ఎక్కువ మంది రైతులు వరి విత్తనాలను వెదజల్లగా అవి మొలకెత్తడంతో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరలేదు. వ్యవసాయ బోర్ల కింద వరినాట్లకు మాత్రం ఈ వర్షాలు ఉపయుక్తంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. మరికొన్ని రోజులు వర్షాలు కురిస్తే బోర్ల కింద జోరుగా వరినాట్లు సాగుతాయని రైతులు అంటున్నారు.

వరుస పద్ధతితో అధిక దిగుబడులు : ఏవో



ఏవో మధుమోహన్

వరుస పద్ధతిలో వరినాట్లు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ముసునూరు మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ తెలిపారు. కుదురు కుదురు మధ్య 10 సెంటీ మీటర్ల, లైన్‌కి లైన్‌కి మధ్య 20 సెంటీమీటర్ల దూరం ఉండేలా నాట్లు వేసుకోవాలని ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వదులుకోవడం వల్ల ఎరువులు, పురుగు మందు పిచికారీ చేసుకునేందుకు వీలు ఉంటుందని, ఈ పద్ధతిలో నాట్లు వేసుకోవడం వల్ల పంటకు సూర్యరశ్మి తగిలి, దోమ, చీడపీడలు ఆశించవని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.